క్లుప్తంగా

'అమృత్' పనుల పరిశీలన



వాటర్ ట్యాంకు పనులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లి, భారత్‌నగర్, సంగాపూర్‌లలో అమృత్ 2.ఓ కింద చేపడుతున్న వాటర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణ పనులను జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తయితే అన్ని వార్డులకు ఏకకాలంలో మంచినీటి సరఫరా చేసే అవకాశముంటుందని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అదనపు కలెక్టర్‌కు వివరించారు. అలాగే డంపింగ్ యార్డులో బయోమైనింగ్, తడి, పొడి చెత్త సేకరణ తీరును పరిశీలించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో బుధవారం హనుమాన్ మాలధారులు, భక్తులు భారీ ఆంజనేయస్వామి విగ్రహంతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ.. జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో శోభాయాత్ర సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారుల వల్లే ధాన్యం కొనుగోలు ఆలస్యం

మద్దూరు(హుస్నాబాద్): అధికారుల నిర్లక్ష్యం వల్లే ధాన్యం కొనుగోలు ఆలస్యమవుతుందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసి నెలలు గడుస్తున్నాయని, అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్కడే ఉందన్నారు. మరోపక్క ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షాల కారణంగా ధాన్యం తడిసి ముద్దవుతుందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, మండల కార్యదర్శి ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని అమ్మితే చర్యలు

హుస్నాబాద్: ముస్లిం శ్మశానవాటిక స్థలాన్ని అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ముస్లిం నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని రామవరం రోడ్‌లో గల శ్మశానవాటిక స్థలం అన్యాక్రాంతంపై అలంగీర్ మజీద్, జామా మజీద్, కమిటీ సభ్యులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్మశానవాటికకు సంబంధించి వక్ఫ్ బోర్డు భూమి 5.36 ఎకరాల్లో 17 కుటుంబాలకు నివాసం ఉండటానికే మాత్రమే అప్పటి ముస్లిం పెద్దలు అనుమతి ఇచ్చారన్నారు. అమ్మడం కాని, కొనడానికి గాని వీలు లేదన్నారు. స్థలాలను ఎవరైనా కొనుగోలు చేస్తే వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మజీదుల కమిటీ సభ్యులు అన్వర్ పాష, అయూబ్, హుస్సేన్, అఫ్జల్, ఖుద్రత్, ఫసీయొద్దీన్, షబ్బీర్, ఇంతియాజ్ ఉన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

అర్బన్ మండల ఏఓ బి.శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: వానాకాలం సాగుకు రైతులు సిద్ధం అవుతున్న నేపథ్యంలో విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరమని, మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని సిద్దిపేట అర్బన్ మండల ఏఓ బి.శ్రీనాథ్ సూచించారు. బుధవారం బక్రిచెప్యాల క్లస్టర్ రైతు వేదికలో వానాకాలం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు, ఆయిల్‌పామ్ సాగు అవశ్యకత, ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ తొలకరి వర్షాలకు లోతు దుక్కులు చేసుకోవడం ద్వారా పంటలకు సంక్రమించే పలురకాల కీటకాలను నాశనం చేసుకోవచ్చని సూచించారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులను పెంచి భూమిలో కలియదున్నుకోవడం వల్ల ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

కూలీలు రాత్రి వేళల్లో తిరగొద్దు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల్లోని పరిశ్రమలు, మిల్లులు, పౌల్ట్రీ ఫామ్‌లలో పని చేసే అంతర్ రాష్ట్ర కూలీలు రాత్రి వేళల్లో బయట తిరగొద్దని ఏఎస్‌ఐ శంకర్‌రావు హెచ్చరించారు. మండలంలోని ఫ్యాక్టరీల వద్ద టేకుదారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. కూలీలు డ్యూటీ అయినపోయిన తరువాత అర్ధరాత్రి వరకు రోడ్డుపై నడుచుకుంటూ తిరగడం వల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. మద్యం, గుట్కా తదితర అవసరాల కోసం బయట కనబడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగుకు సన్నద్ధం

- హుస్నాబాద్ డివిజన్‌లో 1.06 లక్షల ఎకరాల్లో సాగు
- రోహిణి కార్తెకు తొలకరి పలకరింపు
- విత్తన ఎంపికే ప్రధానం
- దుక్కి దున్ని సిద్ధంగా ఉన్న అన్నదాతలు



గాంధీనగర్‌లో దుక్కిని దున్నుతున్న రైతు

హుస్నాబాద్‌రూరల్: వానాకాలం రోహిణి కార్తెతో మొదలవుతుంది. ఈ కార్తెలో నార్లు పోసినా, విత్తనం వేసినా పంట దిగుబడులు సమృద్ధిగా వస్తాయని రైతుల నమ్మకం. ఈ నెల 25న రోహిణి కార్తె ప్రారంభం కానుండటంతో కార్తెకు ముందే తొలకరి వానలు పలకరిస్తున్నాయి. రైతులు పలుగు, పార, అరకలను సిద్ధం చేస్తున్నారు. ఈ కార్తెలో పత్తి విత్తనాలు విత్తడం, మొక్కజొన్న ఇతర ఆరుతడి పంటలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

హుస్నాబాద్ డివిజన్‌లో కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి, మద్దూరు మండలాల్లో 1.06 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయనున్నారు. పత్తి 25000, వరి 68,500, మొక్కజొన్న 2,700, కంది 1000, ఇతర పంటలు 4,700 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది కంటే ఈసారి వరిని తగ్గించి 4100 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేసే విధంగా రైతులను అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

విత్తన ఎంపిక కీలకం

వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు విత్తన ఎంపికే కీలకంగా మారనుంది. పత్తి విత్తనాలను బీటీ–3 పేరుతో పల్లెలకు వ్యాపారులు వచ్చి ఎక్కువ దిగుబడులు వస్తాయని ఆశ చూపించి అంటగడుతున్నారు. దీంతో సరైన దిగుబడి రాక, వచ్చిన పంటకు మంచి ధర పలకడం లేదని చెబుతున్నారు. అలాగే ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించలేకపోవడం వల్ల, విత్తన దుకాణదారులు వారికి నచ్చిన విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. రైతులు విత్తన ఎంపికలో మోసపోతే తీరని నష్టం జరుగుతుంది. రైతులు కొత్త విత్తనాలను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయకుండా పాత రకం విత్తనాలనే సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

సబ్సిడీపై విత్తనాలు అందించాలి



ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వరి, మొక్కజొన్న, పత్తి విత్తనాలు అందిస్తే నకిలీ విత్తనాల బెడద తప్పుతుంది. రైతులకు ఎక్కువ పంట తీయాలనే ఆశ, పట్టుదల ఉంటది. వ్యవసాయ అధికారులు ఎక్కువ దిగుబడులు వచ్చే విత్తనాల గురించి గ్రామాల్లో చాటింపు వేయించాలి. రోహిణి కార్తె మూడు రోజుల్లో రానుంది. నాలుగు పెద్ద వానలు పడితే దుక్కి దున్ని విత్తనం ఏసుడే.

-సంపత్‌రావు, రైతు గాంధీనగర్

తొలకరి చినుకులకు విత్తనం వేయొద్దు



రైతులు రోహిణి కార్తె వచ్చిందని తొలకరి చినుకులకే విత్తనం వేయవద్దు. మూడు, నాలుగు వానలు పడి భూమిలోని వేడి పోయిన తర్వాతే వేయాలి. విత్తనాలు కొనుగోలు చేసే దుకాణంలో రసీదు తీసుకొని పంట చివరి వరకు జాగ్రత్తగా పెట్టుకోవాలి. జీలుగ విత్తనాలు రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయి. పంటలకు ముందు వేస్తే ఎరువుగా పని చేసి పంట దిగుబడులు ఎక్కువగా వస్తాయి.

-శ్రీనివాస్, ఏడీఏ, హుస్నాబాద్ డివిజన్

ధాన్యం కొనుగోలులో వేగం పెంచండి



తుక్కాపూర్‌లో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్



రైతులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య

తొగుట(దుబ్బాక): ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని తహసీల్దార్ శ్రీకాంత్ ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తుక్కాపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకో వాలన్నారు. తూకం వేసిన వెంటనే ధాన్యం బస్తాలను తరలించాలని ఆదేశించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): అకాల వర్షాల రీత్యా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య అధికారులను ఆదేశించారు. బుధవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాంటాలు అయిన వెంటనే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. ఐకేపీ అధికారులు, సీసీలు, వీవో లీడర్లు ఉన్నారు. కాగా మిరుదొడ్డి మండలంలోని లింగుపల్లిలోని గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ రాజ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులు త్వరగా పూర్తి చేయాలి

డీపీఓ దేవకీదేవి



మద్దూరు(హుస్నాబాద్): పెండింగ్‌లో ఉన్న ఈ–పంచాయతీ దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని డీపీఓ దేవకీదేవి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ -పంచాయతీ అప్లికేషన్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా నిధులు కేటాయించామన్నారు. సమావేశంలో మద్దూరు, దూళ్మిట్ట మండలాల ఎంపీడీవోలు రామ్మోహన్, వీరరాజు,ఎంపీవో వెంకటేశ్వర్లు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుస్నాబాద్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం చిన్నచూపు ధోరణితో వ్యవహరిస్తుందని ఆ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీడీ జేఏసీ) హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు చిట్టెల సంపత్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రతి సంక్షేమ పథకంలో 5 శాతం అమలు చేయాలని, ప్రతి నెల రూ.6వేల పింఛన్, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పలుమార్లు సమస్యలు పరిష్కరించాలని కోరినా స్పందించలేదన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. టీజీడీ జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మేడబోయిన వెంకటేష్, ఉపాధ్యక్షుడు నీరటి కనకయ్య, ప్రధాన కార్యదర్శి నవీన్ రెడ్డి, సహాయ కార్యదర్శి లింగం, కోశాధికారిగా వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని నిరసన



చిన్నకోడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం తెస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు దశరథం, ఏటీయూసీ మండల అధ్యక్షుడు నారాయణ, జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం నాలుగు కోడ్‌లను అమలులోకి తీసుకురావడం విడ్డూరమన్నారు. కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

గజ్వేల్‌రూరల్: వాహనదారులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు బ్రీత్ ఎనలైజర్ ద్వారా గుర్తించామన్నారు. బుధవారం వారిని కోర్టులో హాజరుపర్చగా గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ 11 మందికి రూ.16,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ వ్యక్తి అదృశ్యం



కొండపాక(గజ్వేల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. కొండపాక గ్రామానికి చెందిన పొన్నాల మల్లేశం(50) కూలీ పనులు చేస్తూ వచ్చే డబ్బులతో మద్యం తాగి భార్యతో గొడవపడుతూ ఇంటిని పట్టించుకునే వాడుకాదు. ఈ క్రమంలోనే ఈనెల 20న ఉదయం భార్యతో గొడవపడి బయట పని ఉందంటూ ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య యశోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ నేడు మ్యాదరి భాగ్యరెడ్డివర్మ జయంతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి ఉత్సవాలను గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కులసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, హాజరై విజయవంతం చేయాలన్నారు.

◆ కాళేశ్వరం నీళ్లిచ్చినందుకు కక్ష సాధింపా?

బెజ్జంకి(సిద్దిపేట): రైతుల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి కాళేశ్వరం నుంచి సాగు నీళ్లు ఇచ్చినందుకు ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌బాబు ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమై వ్యతిరేకత రాకుండా ఉండేందుకు నాటకం ఆడుతోందన్నారు.

◆ చెక్కు అందజేత

మండల కేంద్రానికి చెందిన చిక్కుడు సత్తయ్యకు ప్రభుత్వం నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైంది.ఈ చెక్కును బీఆర్‌ఎస్ నాయకుడు మహేష్ బుధవారం లబ్ధిదారుడికి అందజేశారు.

◆ విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

నంగునూరు(సిద్దిపేట): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన బుధవారం బద్దిపడగలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్కిరెడ్డి సంతోష్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద గేదెను మేపుతున్నాడు. సాయంత్రం గాలి దుమారం రావడంతో విద్యుత్ స్తంభానికి ఉన్న తీగ తెగి కిందపడింది. ఈ క్రమంలో అటుగా వెళ్లిన గెదేకు తీగ తగలడంతో మృతి చెందింది. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

విద్యుత్ అధికారుల కొత్త ఫోన్ నంబర్లు ఇవే..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు కొత్త ఫోన్ నంబర్‌లు కేటాయించినట్లు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఈ ఫోన్ నంబర్‌లో అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా	ఎస్ఈ	8712471032
సిద్దిపేట డివిజన్..		
సిద్దిపేట	డీఈ	8712471077
సిద్దిపేట టౌన్–1	ఏఈ	8712471081
సిద్దిపేట టౌన్–2	ఏఈ	8712471079
సిద్దిపేట టౌన్–3	ఏఈ	8712471090
నంగునూరు	ఏఈ	8712471082
సిద్దిపేట రూరల్	ఏఈ	8712471086
సిద్దిపేట అర్బన్	ఏఈ	8712471092
చిన్నకోడూరు	ఏఈ	8712471085
మేడిపల్లి	ఏఈ	8712471073
నారాయణరావుపేట	ఏఈ	8712471091
దుబ్బాక టౌన్	ఏఈ	8712471083
దుబ్బాక రూరల్	ఏఈ	8712471087
గజ్వేల్ డివిజన్...		
గజ్వేల్	డీఈ	8712471176
గజ్వేల్ టౌన్	ఏఈ	8712471181
గజ్వేల్ రూరల్	ఏఈ	8712471239
జగదేవ్‌పూర్	ఏఈ	8712471178
ములుగు	ఏఈ	8712471179
వర్గల్	ఏఈ	8712471180
దౌల్తాబాద్	ఏఈ	8712471242
కొండపాక	ఏఈ	8712471244
తొగుట	ఏఈ	8712471245
కుకునూరుపల్లి	ఏఈ	8712471249
హుస్నాబాద్ డివిజన్....		
హుస్నాబాద్	డీఈ	8712471311
హుస్నాబాద్ టౌన్–1	ఏఈ	8712471312
హుస్నాబాద్ టౌన్– 2	ఏఈ	8712471340
హుస్నాబాద్ రూరల్–1	ఏఈ	8712471341
హుస్నాబాద్ రూరల్–2	ఏఈ	8712471318
అక్కన్నపేట	ఏఈ	8712471355
తోటపల్లి	ఏఈ	8712471338
బెజ్జంకి	ఏఈ	8712471339
కోహెడ	ఏఈ	8712471342
బస్వాపూర్	ఏఈ	8712471317
చేర్యాల	ఏడీఈ	8712471335
చేర్యాల టౌన్	ఏఈ	8712471336
చేర్యాల రూరల్	ఏఈ	8712471343
మద్దూరు	ఏఈ	8712471344
కొమురవెల్లి	ఏఈ	8712471356
ధూళ్మిట్ట	ఏఈ	8712471357

మూగజీవాలను, పక్షులను కాపాడుదాం

దాహం తీర్చేందుకు మట్టిపాత్రలు ఏర్పాటు



మట్టిపాత్రలతో ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మూగజీవాలు, పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని ఏబీవీపీ స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కన్వీనర్ ఝాన్సీ అన్నారు. బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సకోర అభ్యాస్ పేరుతో మూగజీవాలు, పక్షుల దాహం తీర్చేందుకు చెట్లకు మంచినీటితో కూడిన మట్టి పాత్రలను ఏర్పాటు చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ ఏబీవీపీ పర్యావరణ పరిరక్షణకు స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ పేరుతో ముందుకు సాగుతుందన్నారు. ఈ వేసవిలో పక్షులకు, మూగజీవులకు నీరు, ధాన్యం గింజలు అందిస్తూ ప్రకృతిలోని ప్రతి జీవిని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఆదిత్య, వైష్ణవి, ప్రణయ్ కుమార్, లక్ష్మీపతి, ఫణిందర్, పరశురాం, హరికృష్ణ, అనీష్, ముని, మహిపాల్, కార్తీక్ పాల్గొన్నారు.

బోధన ఉత్సాహంగా సాగితేనే ఫలితాలు

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



కొమురవెల్లి(సిద్దిపేట): ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

కొండపాక(గజ్వేల్)/కొమురవెల్లి(సిద్దిపేట): బోధనలు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగితే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలోని హైస్కూల్లో ఉపాధ్యాయుల వృత్తి, నైపుణ్యం పెంపుకోసం జరుగుతున్న శిక్షణ తరగతులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా ఆంగ్లంలోనే బోధనలు జరిగేలా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా వేసవి శిక్షణ తరగతులు, ముందస్తు బడిబాట కార్యక్రమాలను చేపట్టిందన్నారు. అలాగే కొమురవెల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. శిక్షణ తీరు, తెన్నులను ఏంఈవో రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ (ఎంఈఓ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్పీ శ్రీనివాస్‌రెడ్డి, రిసోర్సు పర్స న్స్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుకునూరుపల్లిలో..

కుకునూరుపల్లి హైస్కూల్లో జరుగుతున్న శిక్షణ తరగతుల శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్తయ్య, రిసోర్సు పర్సన్స్ సత్యకృష్ణ, రాంచంద్రం, శ్రీనివాస్, రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు మండలంలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోడూరు ఉన్నత పాఠశాలలో బుధవారం ఎల్ఎఫ్ఎల్, ఎస్జీటీ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణలో ఎంఈఓ యాదవరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రణాళిక బద్ధంగా బోధనలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు, ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనను బలోపేతం చేసేందుకే శిక్షణ

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే విద్యను బలోపేతం చేయడానికే ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇస్తున్నామని మెదక్ డైట్ కళాశాల ప్రధానోపాధ్యాయుడు, శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకులు గంగయ్య అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సత్యనారాయణ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలున్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



సిద్దిపేటఅర్బన్: రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హరికృష్ణ



మిరుదొడ్డి(దుబ్బాక): రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా వ్యాప్తంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ దేశంలో ఐటీ రంగాన్ని ప్రవేశపెట్టి ప్రపంచంలోనే అత్యున్నత స్థానంలో నిలిపారని కొనియాడారు.

డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

కోహెడ(హుస్నాబాద్): డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని.. జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.ఈ నెల 15 నుంచి మండల వ్యాప్తంగా డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రను నిర్వహించినట్లు చెప్పారు. బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగింపు సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలనకు మహిళలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల, వీరన్న, శ్రీదేవి, సారయ్య పాల్గొన్నారు.

కొమురవెల్లి మండలంలో..



కొమురవెల్లి: డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలాన్ని డ్రగ్స్ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రాజు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఆటోస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు పోలీస్ సిబ్బందితో కలిసి డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, సేవించినా పోలీసులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.